క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు పరామర్శ



అడ్డాకుల: మండలంలోని శాఖాపూర్‌కు చెందిన కురుమూర్తి యాదవ్(38), మోహన్‌రెడ్డి(35)రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. సోమవారం ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. మృతుల ఇళ్ల వద్దకు వెళ్లి మృతదేహాలపై పూలమాల వేసి నివాళులర్పించారు. రోడ్డు ప్రమాదం గురించి సర్పంచ్ జయన్నగౌడ్ ఎమ్మెల్యేకు వివరించారు.

డీసీసీ అధ్యక్షుడి పరామర్శ..

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి శాఖాపూర్‌లో బాధిత కుటుంబాలను పరామర్శించారు. కురుమూర్తి యాదవ్, మోహన్‌రెడ్డి ఇళ్ల వద్దకు వెళ్లి మృతదేహాలపై పూలమాల వేసి నివాళులర్పించారు.

కంటివెలుగును సద్వినియోగం చేసుకోండి

కోయిల్‌కొండ: కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఆచార్యపూర్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్యసిబ్బంది నిర్వహిస్తున్న కంటి వెలుగు పరీక్షలను వారు పరిశీలించారు. సర్పంచ్ రాము, ఏఎన్‌ఎం శోభారాణి పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలేదీక్షలు

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని నిరసనలు తెలుపుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమని జేఏసీ మండల కన్వీనర్ రామునాయక్, కో కన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. సోమవారం 86వ రోజు మండల సాధన సమితి ఆధ్వర్యంలో చేపడుతున్న రిలేదీక్షలో వారు మాట్లాడారు. ప్రజల ఆకాంక్ష మేరకు గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

దుస్తుల పంపిణీ

కోయిల్‌కొండ: మండంలోని ఆయా గ్రామాలకు చెందిన నిరుపేద మైనార్టీలు 200 మందికి రంజాన్ దుస్తులు పంపిణీ చేసినట్లు తహసీల్దార్ ప్రేమ్‌రాజ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డిలతో కలిసి తహసీల్దార్ సోమవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కృష్ణయ్య, భీంరెడ్డి, మైనార్టీ నాయకులు జాయిద్, మహేమూద్, నజీమ్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీకి సన్మానం

మిడ్జిల్: ఎంపీపీ బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్‌ను సోమవారం చాంబర్‌లో తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి సన్మానించారు. మండల శాలివాహన సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామాంజనేయులు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు జంగారెడ్డి, వార్డు సభ్యులు గోపాల్, జగన్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వీధి నాటకానికి విరాళం

మహమ్మదాబాద్: మండలంలోని మొకర్లాబాద్‌లో ఆదివారం రాత్రి చెన్నకేశవ స్వామి వీధి నాటకానికి వరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నాటక ప్రదర్శనకు రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. గ్రామాల్లో అంతరించిపోతున్న కళలకు జీవం పోస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నారాయణ, వెన్నాచేడ్ సర్పంచ్ పుల్లారెడ్డి, పులిందర్‌రెడ్డి, శరణప్ప తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ పోలీసింగ్

జడ్చర్ల టౌన్: మండలంలోని గంగాపురంలో సోమవారం సీఐ రమేష్‌బాబు ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలీసింగ్ గురించి అవగాహన కల్పించారు. సీసీకెమెరాల ఆవశ్యకత, పోక్సో కేసులు, సైబర్‌క్రైంలపై వివరించారు. సీసీ కెమెరాల వల్ల దొంగతనాలు, నేరాలను నిరోధించవచ్చని తెలిపారు.

పవన్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు

దేవరకద్ర: నియోజకవర్గ బీజేపీ నాయకుడు డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేశారు. అంతకుముందు పాలమూర్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు సుదర్శన్‌రెడ్డి, ఎగ్గని నర్సిములు, సుబ్బిరెడ్డి వెంకట్‌రెడ్డి, నంబిరాజు, యజ్ఞభూపాల్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేపల్లి రాధాకృష్ణకు ఘన నివాళి

జడ్చర్ల టౌన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం పట్టణంలోని ఉమెన్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. సొసైటీ నిర్వాహకురాలు బాలమణి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సొసైటీ సభ్యులు శ్రీలత, రమాదేవి, శిరీష, మానస, వసంత, సంస్కార భారతి సభ్యుడు గోనెల రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఎటు చూసినా సమస్యలే

- మట్టి రోడ్లు.. మురుగు కాల్వలు
- కలుషితమవుతున్న మిషన్ భగీరథ నీరు
- పట్టించుకోని అధికారులు

వార్డ్ వాచ్



కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డు గల్లీలో పారుతున్న మురుగు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని 15వ వార్డు పరిధిలో ఏడు తండాలు ఉన్నాయి. ఇందులో కోయిల్‌కొండ రోడ్డులో నాలుగు, కోస్గి–తాండూరు రోడ్డులో మూడు పొలాల మధ్య ఉన్నాయి. ఈ తండాలతో పాటు చిన్నదర్‌పల్లిలో నివసిస్తున్న వారెవరూ మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అయ్యే నీటిని తాగడం లేదు. అన్ని చోట్ల ఒండునీళ్లు కలుషితమై వస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డులోని గల్లీల్లో డ్రెయినేజీ ఏర్పాటు చేసినా సీసీరోడ్లు నిర్మించలేదు. శివాజీ నగర్‌లో పొలాల మధ్య సుమారు 20 ఇళ్లు ఉంటాయి. రోడ్లు ఊడ్చడానికి పారిశుద్ధ్య కార్మికులు రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. లచ్చిరాం తండాలో సుమారు 25ఇళ్లు ఉంటాయి. నెల రోజుకోసారి డ్రెయినేజీలు శుభ్రం చేస్తున్నారని, సీసీ రోడ్లు నిర్మించాలని తండావాసులు కోరుతున్నారు. చిర్మల్‌కుచ్చ తండాలో 150 ఇళ్లు ఉండగా, పారిశుద్ధ్య సమస్యలు నెలకొన్నాయి. సీసీరోడ్లు లేవు. వీధిలైట్లు సరిగా వెలగవు. హనుమాన్ టెంపుల్ వద్ద క్రీడా ప్రాంగణంలో ఎలాంటి పరికరాలు ఏర్పాటు చేయలేదు. పోచమ్మ ఆలయ సమీపంలోని పూరిగుడిసెల వద్ద విషసర్పాలు సంచరిస్తున్నాయన్నారు. నీల్యానాయక్‌తండాలో సుమారు 50 ఇళ్లు ఉంటాయి. అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కోస్గి ప్రధాన రోడ్డు నుంచి గోదాం చివరి వరకు సీసీరోడ్డు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. శివారులో సుమారు పది గోదాం ఉండగా, బియ్యం, ఇతర వస్తువులను నిల్వ చేస్తున్నారు. అక్కడి నుంచి సాయంత్రం వేళ లక్క పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయని నీల్యా నాయక్ తండా, లచ్చిరాం తండావాసులు వాపోతున్నారు. కోస్గి మెయిన్ రోడ్డుకు 2 కి.మీ. దూరంలో గుట్ట అంచున బోడగుట్టతండా ఉంది. 20ఇళ్లు ఉండగా, ఇటీవలే కొత్తచెరువు అంచు నుంచి మట్టిరోడ్డు వేశారు. వర్షాకాలంలో అది నిండి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతాయి. మిషన్ భగీరథ నీరు ఒండుతో వస్తున్నాయని వాపోయారు. ఇక చిన్నదర్‌పల్లిలో 2,500 జనాభా ఉంటుంది. మిషన్ భగీరథ నీటిని ఎవరూ తాగడం లేదు.

వార్డు 15	జనాభా 5,518
ప్రధాన వీధులు: కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డు (కొంత భాగం), శివాజీనగర్, లచ్చిరాంతండా, చిర్మల్‌కుచ్చతండా, పూజారి తండా, నీల్యానాయక్‌తండా, బోదగుట్టతండా, కర్రెమ్మచెల్క తండా, చిన్నదర్‌పల్లి.	

రూ.1.25కోట్లతో అభివృద్ధి చేశాం..



ఇప్పటికే రూ.1.25కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేశాం. మరో రూ.30లక్షలతో సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నాం. ఇంకా రూ.2కోట్లతో చేపట్టే పనులు టెండర్ల దశలో ఉన్నాయి. తండాల్లో నెలకొన్న సమస్యలను వీలైనంత వరకు పరిష్కరిస్తాం. బియ్యం పురుగుల నివారణకు స్ప్రే చేయాలని యజమానులకు సూచించాం.

– డి.లతాశ్రీ, కౌన్సిలర్, 15వ వార్డు

బియ్యం పురుగులు వస్తున్నాయి..



సమీపంలో ఉన్న గోదాంల నుంచి బియ్యం పురుగులు ఇళ్లలోకి వస్తున్నాయి. తండాలో డ్రెయినేజీలు కట్టినా సీసీ రోడ్లు వేయలేదు. నెలకోసారి పారిశుద్ధ్య కార్మికులు వచ్చి శుభ్రం చేస్తున్నారు. దుర్గంధంతో రోగాలు వస్తున్నాయి.

– సువాళి, గృహిణి, లచ్చిరాంతండా

ట్యాంకులు శుభ్రం చేయాలి..



ఓవర్‌హెడ్ ట్యాంకులు శుభ్రం చేసిన తర్వాతే మిషన్ భగీరథ పథకం నుంచి తాగునీరు వదలాలి. ప్రస్తుతం అంతటా పచ్చగా, ఒండుతో కూడిన నీరు వస్తుండటంతో ఎవరూ తాగడం లేదు. మరమ్మతుకు గురైన పవర్‌బోర్‌ను బాగు చేయించాలి. వీధిలోని సీసీరోడ్డు ఎక్కడికక్కడే తవ్వి వదిలేశారు.

– కుమ్మరి చంద్రశేఖర్, చిన్నదర్‌పల్లి

పొగతో అనారోగ్యం..



శివారులోని డంపింగ్ యార్డులో తడిచెత్తను కాల్చేస్తున్నారు. రాత్రి వేళ దట్టమైన పొగ వ్యాపించి ఇళ్ల వరకు వస్తోంది. ఇటీవలే మా ఎనిమిది నెలల బాబు అనారోగ్యం బారినపడ్డాడు. సమీపంలోనే ప్రైవేట్ సెల్ టవర్ ఉంది. గతంలో రేడియేషన్ కారణంగా ఇద్దరు వృద్ధులు చనిపోయారు. వెంటనే తొలగించాలి.

– విజయ్, కోయిల్‌కొండ ఎక్స్‌రోడ్డు



లచ్చిరాంతండాలో మట్టి రోడ్డే గతి



చిర్మల్‌కుచ్చ తండాలో ధ్వంసమైన మోరీ



చిన్నదర్‌పల్లిలోని ఓ గల్లీలో ఇలా..

సైబర్ నేరాలపై అప్రమతత్త అవసరం

నవాబుపేట: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పురుషోత్తం తెలిపారు. సోమవారం మండలంలోని పల్లెగడ్డలో సైబర్ నేరాలు తదితర అంశాలపై పోలీసు కళాజాతా ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ గ్రామాల్లో మూఢ నమ్మకాలు విడనాడాలని సూచించారు. బాల్య వివాహాలు చేస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. సైబర్, ఆన్‌లైన్ మోసాలకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములమ్మ, ఎంపీటీసీ శ్రీనివాస్, ప్రతాప్, అనిత, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ అందజేత



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): హన్వాడ మండలం రామన్నపల్లికి చెందిన చెన్నయ్యకు ప్రభుత్వం నుంచి సీఎంఆర్‌ఎఫ్ కింద మంజూరైన రూ.2.50లక్షల మంజూరు పత్రాన్ని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ బాధితుడికి సోమవారం హైదరాబాద్‌లో అందజేశారు. ఆపదలోఉన్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్ అండగా ఉంటుందని మంత్రి తెలిపారు.

నేరాలకు పాల్పడితే పీడీయాక్ట్



మహబూబ్‌నగర్ క్రైం: శాంతి భద్రతలకు సమస్య కలిగించి, నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ డి.స్వామిగౌడ్ అన్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో ఉన్న రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు సోమవారం పోలీస్‌స్టేషన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎలాంటి సంఘ విద్రోహక కార్యకలాపాల్లో పాల్గొనరాదని, ప్రతి ఒక్కరూ సత్ప్రవర్తనతో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు రామకృష్ణ, బాలకృష్ణ పాల్గొన్నారు.

సోదరభావంతో మెలగాలి



జడ్చర్లలో ఇఫ్తార్‌లో పాల్గొన్న అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ఆర్‌కే గార్డెన్‌లో సోమవారం సాయంత్రం ముస్లింలకు కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఉపవాసదీక్షలు చేస్తున్న ముస్లింలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఓబేదుల్లా కొత్వాల్, దుశ్యంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండీడ్: హిందూ, ముస్లింలు సోదరభావంతో మెలగాలని వెన్నాచేడ్ సర్పంచ్ పుల్లారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెన్నాచేడ్‌లో జామమసీదులో ముస్లింలకు ఇఫ్తార్ ఇచ్చారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షుడు శేఖ్‌అలీ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నరసింహారావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మక్సూద్, పులింధర్‌రెడ్డి, శరణప్ప, రాములు, అక్రం, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

జడ్చర్ల టౌన్: అకస్మాత్తుగా జరిగే అగ్నిప్రమాదాల నివారణ గురించి 9వ వార్డు రాజీవ్‌నగర్ కాలనీలో సోమవారం స్థానిక ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ మల్లిఖార్జున్ వివరించారు. ఎల్‌పీజీ సిలిండర్ ప్రమాద సమయంలో బేకింగ్‌సోడా వినియోగించి మంటలను ఎలా ఆర్పాలో ప్రదర్శన ద్వారా చూపించారు. అలాగే ఇంట్లో జరిగే ఎలక్ట్రిక్ ప్రమాదాలను బేకింగ్‌సోడాతో ఎలా నియంత్రించవచ్చో చూయించారు. వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించటంతో పాటు పెట్రో ప్రమాదాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ చైతన్యచౌహాన్, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



జడ్చర్లలో మాట్లాడుతున్న తెలుగు సత్తయ్య

జడ్చర్ల టౌన్: ఐకేపీ వీఓఏల సంఘం, సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా వీఓఏలు నిరవధిక సమ్మె ప్రారంభించారు. సమ్మెనుద్దేశించి సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తెలుగు సత్తయ్య మాట్లాడుతూ 19ఏళ్లుగా మహిళల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న వీఓఏల జీవితాలకు భరోసా లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం వీఓఏల న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలన్నారు. గత నెల 17నుంచి మూడు రోజుల పాటు టోకెన్ సమ్మె నిర్వహించినా ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల నిరవధిక సమ్మెకు పిలుపునివ్వాల్సి వచ్చిందన్నారు. ఉద్యోగ భద్రత, కనీసవేతనం రూ.26వేలు, గుర్తింపుకార్డులు ఇవ్వాలని కోరారు. వీఓఏల సంఘం జిల్లా కార్యదర్శి రమేష్, కోశాధికారి వాసియాబేగం, సభ్యులు రమాదేవి, సరస్వతి, అలివేల, బుజ్జి, రాజు, శంకర్ పాల్గొన్నారు.

మిడ్జిల్: ఐకేపీ వీఓఏల సమస్యలను పరిష్కరించాలని సోమవారం మండల కేంద్రంలో సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు వెంకటయ్య, సరిత, దేవమణి పాల్గొన్నారు.

వాసవీ, వనితా క్లబ్ సేవలు ప్రశంసనీయం

స్టేషన్ మహబూబ్‌నగర్: వాసవీ, వనితా క్లబ్‌లు చేపడుతున్న సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ గవర్నర్ మేడిశెట్టి రామకృష్ణ అన్నారు. స్థానిక పాత బస్టాండ్ సమీపంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, అంబలి కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. సామాజిక సేవలే లక్ష్యంగా వాసవీ, వనితా క్లబ్‌లు ముందుసాగుతున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరిన్ని సేవలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్షుడు వలకొండ చంద్రశేఖర్, రామేశ్వర్, వినోద్, రాంచంద్రయ్య, శ్రీదేవి, రాధిక, లావణ్య, రాఘవేందర్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండలంలోని లింగంపల్లి, యన్మన్‌గండ్ల గ్రామాల్లో సోమవారం చలివేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పాండురంగారెడ్డి, జయమ్మ, ఉపసర్పంచ్‌లు రఘువీర్, పద్మారెడ్డి పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీపీ సుదర్శన్, తహసీల్దార్ రాజీవ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్ఐ రామాంజనేయులు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు రమేష్, గోపాల్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వాసవీక్లబ్ సభ్యులు

చలివేంద్రం ప్రారంభం

బాలానగర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా, తహసీల్దార్ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత అక్షయకుమార్ కేసీ రెడ్డి జ్ఞాపకార్థం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్ కసిరెడ్డి, ఆర్ఐ వెంకట్ రెడ్డి, రాజేశ్వరి, దవలేష్, గోపి, శంకరి ఉన్నారు.

నేడు కోస్గి ఫీడర్ పరిధిలో కరెంట్‌కు అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాకేంద్రంలోని 11 కేవీ కోస్గి రోడ్డు ఫీడర్ మెయింటెనెన్స్‌లో భాగంగా మరమ్మతు చేస్తుండడంతో మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్‌శాఖ టూటౌన్ ఏఈ ఆదిత్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా రెండు సడాకులు, ఖలీల్ చౌక్, అగ్నిమాపక కేంద్రం, అలీ మసీదు, టీడీ గుట్ట పాపిరెడ్డి కంపౌండ్ ప్రాంతాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

షర్మిలతోనే సంక్షేమ పాలన సాధ్యం

స్టేషన్ మహబూబ్‌నగర్: షర్మిల ముఖ్యమంత్రి అయితేనే వైఎస్సార్ సంక్షేమ పాలన సాధ్యమని వైఎస్సార్ తెలంగాణ పార్టీ మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆర్.రవిప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో సోమవారం గడప గడపకు వైఎస్సార్‌టీపీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైఎస్సార్ సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా రవిప్రకాశ్ మాట్లాడుతూ దివంగత మహానేత వైఎస్ఆర్ తన హయాంలో నిరుపేదల సంక్షేమానికి ఎంతగానో కృషి చేశారని అన్నారు. ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, ఇంటింటికి తాగునీటి సౌకర్యం, విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్, ఆపదలో ఉన్న వారి కోసం 108, పెన్షన్‌తో పాటు పథకాలను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అయ్యప్ప సునీల్, పార్టీ పట్టణ అధ్యక్షుడు మహేందర్‌జీ, నాయకులు అశోక్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీ నాయకుడికి సన్మానం

స్టేషన్ మహబూబ్‌నగర్: విదేశీయాత్ర(ఆస్ట్రేలియా)కు వెళ్తున్న వైఎస్సార్ తెలంగాణ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ హైదర్‌అలీని సోమవారం జిల్లా కేంద్రంలో మిత్రబృందం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. విదేశీ యాత్ర దిగ్విజయంగా పూర్తి చేసుకోవాలని వారు ఆకాంక్షించారు. రియల్ ఎస్టేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు.

రెండో విడత గొర్రెల పంపిణీపై అవగాహన

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం రెండో విడత గొర్రెల పంపిణీపై మండలంలో ఉన్న కాపరులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీ నర్సింహయాదవ్ సమావేశానికి హాజరయ్యారు. రెండో విడతకు ఎంపికైన లబ్ధిదారులు తమ వాటా కింద 25శాతం డబ్బులను బ్యాంకులో జమ చేయాలని డాక్టర్ మధుసూదన్ సూచించారు. ఒక్కో యూనిట్‌కు రూ.43,750లను బ్యాంకులో జమ చేయాలని తెలిపారు. చనిపోయిన లబ్ధిదారులను గుర్తించి వారి నామినీలకు యూనిట్లను అందజేసే విధానం గురించి వివరించారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు



భూమిపూజ చేస్తున్న ప్రజాప్రతినిధులు

నవాబుపేట: మండలంలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లకు తాగునీటిని అందించేందుకు ప్రత్యేక వాటర్ ట్యాంకులు ఏర్పాటు చేసినట్లు జెడ్పీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, మార్కెట్ చైర్మన్ లక్ష్మయ్య, ఎంపీపీ అనంతయ్య తెలిపారు. సోమవారం మండలంలోని యన్మన్‌గండ్ల సమీపంలో నిర్మించిన డబుల్‌బెడ్రూం సముహంలో రూ.15లక్షలతో నిర్మించే వాటర్ ట్యాంకు, నల్లాల ఏర్పాటు పనులకు వారు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జయమ్మ, వైస్ ఎంపీపీ సంతోష్‌రెడ్డి, ఉపసర్పంచ్ రఘువీర్, శ్రీనివాస్, భాస్కర్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారం

దేవరకద్ర: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే అధికారమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కాటం ప్రదీప్‌కుమార్‌గౌడ్ తెలిపారు. సోమవారం మండలంలోని అడవి అజిలాపూర్‌లో హాథ్‌సే హాథ్ జోడో కార్యక్రమంలో ఆయన పాల్గొని గడప గడపకు తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రదీప్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి తప్పా బీఆర్‌ఎస్ కొత్తగా చేసిందేమీ లేదని ఆరోపించారు. ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేసిన కాంగ్రెస్ పట్ల ప్రజలు ఇంకా అభిమానం చూపిస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2లక్షల రుణమాఫీ, పంటలకు మద్దతు ధర, నిరుపేదలకు రూ.5లక్షలతో ఇందిరమ్మ ఇళ్లు, కౌలు రైతులకు ఏడాదికి రూ.15వేలు, భూమి లేని కూలీలకు ఏడాదికి రూ.12వేలు అందజేస్తుందని వెల్లడించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాందాసు, నాయకులు టీసీ శ్రీనివాస్, వెంకటేశ్, నర్వ శ్రీను, వెంకటయ్య, నాగిరెడ్డి, రాజేందర్, గోపాల్, చిన్నయ్య, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళలతో మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ప్రదీప్‌కుమార్‌గౌడ్

పనులు చేసినా పైసలేవీ?

- మండల సర్వసభ్య సమావేశంలో అధికారులపై సభ్యుల ఆగ్రహం

దేవరకద్ర: ఉపాధి హామీ పథకం కింద రావాల్సిన బిల్లులు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పలువురు సర్పంచ్‌లు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై సభ్యులు చర్చించి తమ సమస్యలను వెల్లడించారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించిన బిల్లులు అన్ని జిల్లాల్లో వచ్చాయని, కేవలం మహబూబ్‌నగర్ జిల్లాలో మాత్రమే రాలేదని మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శివరాజు, సర్పంచ్‌లు శ్యాంసుందర్‌రెడ్డి, రామాంజనేయులు, శ్రీనివాసులు, రజిత, ఎంపీటీసీ యజ్ఞభూపాల్‌రెడ్డి సంబంధిత ఏపీఓ రవిప్రకాశ్‌పై ధ్వజమెత్తారు. ఆన్‌లైన్‌లో బిల్లులు చేసే సమయంలో మన జిల్లాకు రాత్రి పదకొండున్నరకు అవకాశం వచ్చిందని, అప్పటికే సబ్‌మిట్ చేసినప్పటికీ నోఫండింగ్ అని వచ్చిందని ఏపీఓ రవిప్రకాశ్ తెలిపారు. గ్రామాల్లో పూర్తి చేసిన సీసీ రోడ్లు, ఇతర పనుల కోసం అప్పులు చేశామని, వాటిని తీర్చలేక పోతున్నామని సభ్యులు తెలిపారు.

నర్సరీలకు, హరిత హారం మొక్కలకు రెండేళ్లుగా ట్యాంకర్ల ద్వారా నీటిని పోస్తున్నామని, ఇప్పటి వరకు బిల్లులు చెల్లించలేదని సర్పంచ్‌లు ఆరోపించారు. ఇక నుంచి డిపార్టుమెంట్ ద్వారా నీటిని పోసి మీరే బిల్లులు తీసుకోండని సభ్యులు తేల్చిచెప్పారు. ఇందుకు ఎంపీడీఓ శ్రీనివాసులు స్పందిస్తూ బిల్లుల చెల్లింపుపై ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

ఏఈని తొలగించండి

పాఠశాలల్లో చేపట్టిన మన ఊరు–మన బడి కార్యక్రమం కింద చేసిన నిర్మాణం పనులకు సంబంధిత ఏఈ బిల్లులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సభ్యులు ఆరోపించారు. నాలుగు మండలాలకు కలిపి ఉన్న ఏఈని తొలగించి దేవరకద్ర మండలానికి వేరే ఏఈని నియమించాలని సభ్యులు కోరారు. ఎంఈఓ జయశ్రీ స్పందిస్తూ ఏఈతో మాట్లాడి బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



బిల్లుల చెల్లింపుపై ఏపీఓను నిలదీస్తున్న సభ్యుడు

తాగునీరు అందించాలి

గ్రామాల్లో కొత్తగా ఏర్పడిన కాలనీలకు తాగునీటిని అందించడానికి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టాలని పలువురు సర్పంచ్‌లు కోరారు. పంచాయతీలకు వచ్చే ఫండ్‌లో 15శాతం నిధులు తాగునీటి అవసరాలకు వాడుకోవచ్చని ఏఈ కీర్తి తెలిపారు. బీఎల్‌ఓలు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు పని చేయాలని తహసీల్దార్ జ్యోతి తెలిపారు. ఓటు హక్కు కల్పించాలని, అడ్రస్ మార్పులు, తొలగింపులు చేపట్టే బాధ్యత బీఎల్‌ఓలదేనని అన్నారు. అనంతరం వ్యవసాయం, వైద్యం, ఐకేపీ, పశువైద్యం, విద్యుత్, పౌరసరాఫరాలు, మిషన్‌కాకతీయ అంశాలపై చర్చ నిర్వహించారు. సమావేశంలో మార్కెట్ చైర్మన్ విజయ, జెడ్పీటీసీ అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ సుజాత, సింగిల్ విండో చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఈఓ రాజేంద్ర అగర్వాల్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, హార్టికల్చర్ అధికారి మహేందర్ పాల్గొన్నారు.